సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

బాక్సింగ్ విజేతలకు అభినందనలు



ట్రోఫీ సాధించిన విజేతలను అభినందిస్తున్న బీడీఎఫ్ఐ అధ్యక్షుడు యల్లపు రఘురామ్, చందు

కంచరపాలెం: ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఏడో నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ పోటీలకు జిల్లా నుంచి బీడీఎఫ్ఐ అధ్యక్షుడు యల్లపు రఘురామ్, కోచ్‌లు మణి, ఆదినారాయణ ప్రాతినిధ్యం వహించారు. ఈ చాంపియన్‌షిప్‌లో జిల్లా బాక్సింగ్ విజేతలను శనివారం కైలాసపురం మధుసూదన్‌నగర్‌లో ఘనంగా సత్కరించారు. నేషనల్ బాక్సర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామ్‌తో పాటు చాంపియన్‌షిప్ ట్రోఫీ సాధించిన విజేతలను నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, ఏయూ డాక్టర్ గొట్ల కృష్ణారెడ్డి, మెడికల్ అధికారి డాక్టర్ సునీత ఘనంగా సత్కరించారు. జాతీయ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో రాష్ట్ర బాక్సర్లకు వివిధ కేటగిరీల్లో మొత్తం 34 బంగారు, 14 వెండి పతకాలు లభించాయని బీడీఎస్ఐ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వైజర్లు సి.సాయి సతీష్, పి.గణేష్, ఆర్‌వోసి రుబిన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు మతిస్థిమితం లేని యువతి



లోహర్ వర్ష బోరణాని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ ఎర్రంనాయుడు, సిబ్బంది

అల్లిపురం: తప్పిపోయిన మతి స్థిమితంలేని యువతిని టూటౌన్ పోలీసులు వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం అల్లిపురం మెయిన్‌రోడ్డులోని మోడల్ స్కూల్ వద్ద నివసిస్తున్న లోహర్ హతమాత్రం బొరానా, దేవో లోహర్‌ల మతిస్థిమితం లేని కుమార్తె లోహర్ వర్ష బొరణా శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ ప్రారంభించారు. దువ్వాడలో రాత్రి రోడ్డుపై వర్ష బోరణా జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు కనిపించింది. వారు ఆమెను ప్రభుత్వ బాలికల వసతి గృహానికి అప్పగించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వసతి గృహం నుంచి తీసుకొచ్చి శనివారం ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.

పద్యపఠనంపై విద్యార్థులకు అవగాహన



పద్యపఠనం చేస్తున్న విద్యార్థిని

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులతో పద్యపఠనం నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమకర్త దత్తి అప్పలనాయుడు రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. విద్యార్థులకు పద్యపఠనం వల్ల ప్రయోజనాలను వివరించారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నామని షీలానగర్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సర్టిఫికెట్ కోర్సుకు డిగ్రీ పాసైన లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏడాది వ్యవధి గల ఈ కోర్సులో ఆరు నెలల పాటు అభ్యర్థులకు స్టైఫండ్ అందిస్తామన్నారు. కోర్సు పూర్తి అనంతరం ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందిస్తామన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు డిప్లొమా, బీఎస్సీ, పారామెడికల్, నర్సింగ్, ఎంఎల్టీ, బీపీటీ, కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు 7995013421, 7995013422 నంబర్లలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వెనుక నున్న బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో సంప్రదించాలని కోరారు.

గంగుల గెడ్డ.. ఘోరం



డాల్ఫిన్ జంక్షన్‌లో గంగుల గెడ్డలో మొలిచిన మొక్కలతో కుంచించుకుపోయిన గెడ్డ

75 ఫీట్ రోడ్డులో తొలగించిన రక్షణ కంచె





డాల్ఫిన్ జంక్షన్‌లో విరిగిన రక్షణ గోడ

- పూడికలు.. ఇసుక మేటలతో ఎక్కడి మురుగు అక్కడే
- శిథిలమైన రక్షణ గోడలు
- రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పనులు చేపట్టాలి
- స్థానికుల డిమాండ్

నియోజకవర్గంలో గంగుల గెడ్డ **పూడికలు, మొక్కలతో** నిండిపోయింది. **ఎక్కడికక్కడ మట్టి** మేటలు వేయటం**తో నీటి ప్రవాహానికి ఆటం**కం కలుగుతోంది. **రానున్న వర్షాకాలాన్ని** దృష్టిలో పెట్టుకుని **గెడ్డలోని పూడికలు తొలగిం**చాలని స్థానికులు **కోరుతున్నారు. గెడ్డలో ప్లాస్టిక్** వ్యర్థాలు, చెత్తతో **మురుగు ప్రవాహం సాఫీగా** సాగక అపారిశుధ్యం, **దుర్గంధం వ్యాపిస్తున్నాయి. డాల్ఫిన్** జంక్షన్, 75 ఫీట్ రోడ్డు **పరిధిలో గెడ్డకు సంబంధించిన** రక్షణ గోడలు శిథిలమవటం**తో స్థానికంగా ఉన్న వ్యాపారులు** గెడ్డలో చెత్త వేస్తున్నారు. **దీంతో పూడికలు పెరిగిపోతున్నా**యి. తూర్పు నియోజ**కవర్గంలో గెడ్డల రక్షణ గోడ**లు సుందరంగా ఏర్పాటు **చేయటంతో ఆహ్లాదంగా ద**ర్శనమిస్తున్నాయి. అదే **విధంగా దక్షిణ నియోజకవ**ర్గంలోని గంగుల గెడ్డ **రక్షణ గోడలు కూడా అలం**కరించాలని స్థానికు**లంటున్నారు. వర్షాకా**లం రాక ముందే **గెడ్డల ప్రక్షాళన చేపట్టా**లని నియోజకవర్గ **ప్రజలు కోరు**తున్నారు.

– అల్లిపురం



డాబాగార్డెన్స్ పరిధిలో గెడ్డలో పూడికలు



మనోరమ థియేటర్ వద్ద గెడ్డలో పూడికలు



ఎంవీపీ సెక్టార్ 11లో గెడ్డ రక్షణ గోడగా ఏర్పాటు చేసిన సుందర వనం



కొబ్బరితోట వద్ద గెడ్డలో పూడికలు



ఎంవీపీ సెక్టార్ 8 వద్ద ఏర్పాటు చేసిన వనం

కట్టిన సొమ్ము తిరిగి చెల్లించాలని వినతి


డాబాగార్డెన్స్: మూడేళ్లు కావస్తున్నా ఇంటి నిర్మాణానికి సంబంధించి ఒక్క రాయి పడలేదు.. పనులు ప్రారంభం కాలేదు సరికదా.. మేము కట్టిన సొమ్ము మాకిచ్చేయండని వేడుకున్నా ఇవ్వడం లేదని ఉత్తర నియోజకవర్గానికి చెందిన చప్ప రామునాయుడు గోడు వెళ్లబోసుకున్నారు. శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. తన తండ్రి చప్ప దేముడు ఆనందపురం మండలం, రామవరం గ్రామం ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లో ఫ్లాట్ కొనుగోలుకు 2022 జూన్ 30న రూ.2 లక్షల 10 వేలు ముందస్తుగా చెల్లించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉందని, ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, ఫ్లాట్ కేటాయింపు కాలేదన్నారు. ఈ విషయమై గత ఏడాది అక్టోబర్ 28న వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రామునాయుడు


ఈ ఏడాది జనవరి 20న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ దృష్టికి తీసుకెళ్లానని, ఇప్పటికీ డబ్బులు రాలేదన్నారు. గత మార్చి 28న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్ వద్ద జరిగిన ఓపెన్ వేలంలో సెంట్రల్ పార్క్‌కు ఎదురుగా ఉన్న దుకాణం కోసం టెండరులో పాల్గొనగా పోటీదారులు లేరన్న కారణంతో ఆ వేలం రద్దు చేశారన్నారు. రామవరం ఫ్లాట్‌ను వెంటనే అప్పగించాలని, లేదా డబ్బులు తిరిగి ఇవ్వాలని, ఖాళీగా ఉన్న వీఎంఆర్‌డీఏ దుకాణాలకు నూతన నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.



ఆలయ పర్యవేక్షకునికి విరాళం అందజేస్తున్న దాత మాలిని

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి నగరానికి చెందిన చలసాని మాలిని రూ.లక్ష విరాళం శుక్రవారం ఆలయ పర్యవేక్షకునికి అందజేశారు. కార్యక్రమంలో మాలిని కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: వైశాఖ మాసం మొదటి శనివారం సందర్భంగా బల్లిగిరి వేంకటేశ్వరమెట్ట దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. స్వామివారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాతసేవ, అర్చనలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పమాలికలు, తులసి మాలలతో విశేషంగా అలంకరించారు.



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

స్వామికి మామిడి పండ్లను భక్తులు సమర్పించుకున్నారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో విశేష అష్టోత్తర పూజా కార్యక్రమం నిర్వహించారు. 8వ తేదీ సాయంత్రం 7 గంటలకు స్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు.

కుట్టు శిక్షణ ప్రారంభం

అరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు డ్రైవర్స్ కాలనీ షాదీఖానా భవనంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరం అందుబాటులోకి వచ్చింది. ఈ శిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో ఇక్కడ మహిళలకు 90 రోజుల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీయూఆర్‌డీ కో ఆర్డినేటర్ కిశోర్‌కుమార్, ఏపీడీ శ్రీరామ్, సీవో అరుణ్‌కుమార్, ఒమ్మి సన్యాసిరావు, ముగడ రాజారావు, రాగతి అచ్యుతరావు, మోది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సమాజం ప్రతినిధులు

అల్లిపురం: బంగారుమెట్టలోని శ్రీ రామాంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఏడాది వేసవిలో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా మజ్జిగ పంపిణీ చేపడుతున్నామన్నారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ నాయకులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ ముందుగా పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ దేశంలో స్వయం ప్రాతిపదిక గల సంస్థ అని, స్వతంత్రానికి ముందే ఈ సంస్థ ఆవిర్భవించిందని తెలిపారు. కార్మిక హక్కుల కోసం, మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ఐఎన్‌టీయూసీ అవతరించిందన్నారు. ఈ మేరకు పలువురు కార్మిక నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. జిల్లా జనరల్ సెక్రటరీ బోగవెల్లి నాగభూషణం, స్టేట్ ఉపాధ్యక్షుడు కొండబాబు, తాతబాబు, కేటీ భాస్కర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రమంతా ఒకే రోజు ఆఫ్‌లైన్‌లో డీఎస్సీ నిర్వహించాలి

సీతంపేట: డీఎస్సీ పరీక్షలను నెల రోజుల పాటు కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించడం వల్ల నిరుద్యోగులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రోజు ఒక్కో ప్రశ్నాపత్రం ఉండటం వల్ల కష్టమైన పేపర్ వచ్చిన వారు నష్టపోయే అవకాశం ఉందని, మొదటి రోజుల్లో పరీక్ష తేదీ వచ్చిన వారు మిగతా రోజులు ప్రిపరేషన్‌కు సమయం కోల్పోతారని అన్నారు. అందరికీ ఒకేరోజు ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించాలని, డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితిని 47 ఏళ్లకు పెంచాలని, 2600 స్పెషల్ డీఎస్సీ పోస్టులను కూడా ప్రస్తుత డీఎస్సీతో భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్పెషల్ బీఈడీ, డైట్ చదివిన లక్ష మంది నిరుద్యోగులు స్పెషల్ డీఎస్సీ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఏఈఈ పోస్టుల భర్తీలో 30 శాతం ఏపీపీఎస్సీ ద్వారా, 70 శాతం ప్రమోషన్ల ద్వారా చేపట్టాలనే ప్రతిపాదనను వ్యతిరేకించారు. టీటీడీలో ఏఈఈ, ఏఈ, జేటీవో పోస్టులను రాత పరీక్ష ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సుధీర్, లక్ష్మణరావు, పురంధరి, అన్వేష్ పాల్గొన్నారు.

వాసుపల్లి ఔదార్యం



పేగు కేన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 28వ వార్డుకు చెందిన రావాడ సత్యారావు పేగు కేన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న వాసుపల్లి శనివారం రూ. 5 వేలు తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతో మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీని ప్రవేశపెడితే.. ఆయన వారసుడిగా జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీలో మరిన్ని సేవలు విస్తృతం చేశారని, జననేతను ఆదర్శంగా తీసుకుని ఆర్థిక సాయం కొనసాగిస్తున్నానని వెల్లడించారు. పేదలకు అండగా ఉండడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని, త్వరలో అధికారంలోకి వచ్చిన వెంటనే తన సేవలు మరింత విస్తృతం చేస్తానన్నారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, పార్టీ విశాఖ జిల్లా సెక్రటరీ పద్మనాభం అమ్మాజీ, పార్టీ నాయకులు గురజాపు రవి, నీలాపు సర్వేశ్వరరెడ్డి, పీతల వాసు, ముత్తాబత్తుల రమేష్, ముజీబ్‌ఖాన్, సువార్తరాజు, రాజుపాత్రుడు, బెవర మహేష్, సూర్యనాయుడు, లండా రమణ, కృష్ణకుమార్‌రెడ్డి, కృష్ణంరాజు, సాగర్, రాము మాస్టార్ తదితరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థి ఫీజుకు ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

పేద విద్యార్థికి ఆర్థిక సాయం..

పేద విద్యార్థి కళాశాల ఫీజు కోసం వాసుపల్లి గణేష్ కుమార్ శనివారం రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. 36వ వార్డుకు చెందిన పాడుగు జోష్నవికి ఆ మొత్తాన్ని శనివారం తన కార్యాలయంలో అందజేశారు. వైఎస్సార్‌సీపీ అంటేనే పేదల పార్టీ అని, మహానేత వైఎస్సార్ తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ స్థాయిలో పేదలకు విద్యా, వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పాలన అందక పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోట పద్మావతి, ముజీబ్‌ఖాన్, కట్టుముంచు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి ఒరిగిన చెట్టు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధారలోని ఒక మార్గంలో ఒరిగిపోయిన చెట్టు పాదచారులు, వాహన చోదకులను భయాందోళనలకు గురి చేస్తోంది. నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ఎస్ఎఫ్ఎస్ స్కూల్ నుంచి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కు వెళ్లే మార్గంలో ఒక చెట్టు కొంతకాలంగా బాగా కిందకు ఒరిగిపోయి ఉండటం ఆందోళన కలిగిస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల అడపా దడపా కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలులకు ఈ చెట్టు ఎక్కడ పడిపోతుందో అని స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు హడలిపోతున్నారు. స్థానిక సచివాలయం ఎమినిటీస్ సెక్రటరీ స్పందించి జీవీఎంసీ జోన్–3 హార్టికల్చర్ విభాగం ద్వారా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



సీతమ్మధారలో రోడ్డుపైకి ఒరిగిపోయి ఉన్న చెట్టు